# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**MARCH 1996**

# సంక్షిప్త వార్తలు

ఫిబ్రవరి నెల సువార్తికుల సదస్సు కాకినాడ సత్యవాణి బిల్డింగ్ నందు 7వ తేదీ నుండి 9 వ తేదీ వరకు క్షేమాభివృద్ధికరముగాను, ఆశీర్వాదకరముగాను జరిగెను. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల నుండి సువార్తికులు తరలి వచ్చిరి. చక్కని వర్తమానముల ద్వారా హృదయములు ఆదరించబడుటయేగాక స్థానిక సంఘాలలో ఈ గొప్ప సందేశములను అందించగలుగునట్లు వారు తర్ఫీతు పొందిరి. మంచి మాదిరి, క్రైస్తవజీవితము, సంఘము మరియు వాక్యము యొక్క ప్రాముఖ్యమును గూర్చి ఈ సదస్సులో సోదరులు మాట్లాడిరి.

12 సంవత్సరాల అనంతరము భారత దేశమునకు వచ్చిన క్రీస్తు యోధుడు ఛార్లెస్ స్కాట్ గారు మంచి హెచ్చరికలు చేసిరి. 96కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో 10 కోట్ల 56 లక్షల మంది ముస్లింలు; 3 కోట్ల 80 లక్షల సిక్కు బౌద్ధ మతాల వారు, 2 కోట్ల 78 లక్షల మత శాఖల వారు 10 లక్షల మంది క్రీస్తు సంఘ సభ్యులు ఉన్నారు. క్రీస్తు సంఘసభ్యులు జరిగించవలసిన పని ఎంతో ఉన్నది. వారు సత్యమును ప్రకటించుటకు ఎల్లప్పుడు సన్నద్ధులై యుండవలసియున్నది. దేశంలో 7లక్షల గ్రామాలు, పట్టణాలు, నగరాలు ఉన్నవి. అనేక చోట్ల మనం పనిచేయవలసిన అవసరం ఉన్నది. చార్ల్స్ స్కాట్ గారితో బాటు తేన్ ఏట్కిన్స్, రోయన్ ఫ్రెడరిక్, ఆల్బర్ట్ గార్డనర్, బిల్ బేట్స్, రేండల్ హేగ్‌వుడ్, మైక్‌షేరో మొదలగు విదేశీ సోదరులు, పాల్ గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. ఈ సదస్సు సహోదరులకు సంతోషమును ఆదరణను

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 మార్చి 1996 సంచిక 8

## సంపాదకీయము

### స్థిరమైన పునాది

### *(The Sure Foundation)*

యేసు సంఘమును కట్టుదునని చెప్పినప్పుడు దాని నొక బండపై కట్టుదునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). అయితే అసలు ప్రశ్న యేమంటే ఆ బండ యేమిటి? లేక యెవరు? దీనికి జవాబు నిచ్చుటకు మనము దాని సందర్భమును గమనించవలెను. మొదటిగా, నేనెవరినని మనుష్యులు తలంచుచున్నారు? అని ప్రభువు తన శిష్యుల నడిగెను. ప్రజలాయనను ఒక ప్రవక్తగా భావించుచున్నారని వారు ఆయనకు వివరించిరి. "అందు కాయన మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారినడిగెను". అందుకు సీమోను పేతురు, "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను." ప్రభువు కోరునట్టి జవాబు అదే గనుక "యేసు సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు;

పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును; పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను అనెను." అయితే పేతురు ఏమి ఒప్పుకొనెను? యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనెను. అంతకు తక్కువ ఏమీ కాదు. అందుకు ప్రభువేమి చెప్పెను? ఆయన ఈ బండమీద అనగా నేను దేవుని కుమారుడనని నీవు చేసిన ఒప్పుకోలు మీద, నా సంఘమును కట్టుదును అని చెప్పెను. ఇంకొక మాటలో క్రీస్తు ఒక సంఘమును నిర్మించబోవుచున్నాడు; దానిని స్థిరముగా యుండు పునాదిపై ఆయన నిర్మించబోవు చున్నాడు. అది అట్లయిన దానిని పేతురుపై గాని లేదా అపొస్తలులపై గాని నిర్మించబోవుట లేదు. ప్రశ్నేమంటే ఆయన దేవుని కుమారుడా? కాదా? యనునది. ఆయనే దేవుని కుమారుడనే జవాబు కూడ దొరికినది గనుక ఈ గొప్ప సత్యముపై ఆయన తన సంఘమును నిర్మింతునని ప్రకటించెను. ఈ గొప్ప వాస్తవముపై నేటికింకను సంఘము ఆధారపడియున్నది. క్రీస్తు దేవుని కుమారుడు కాదని నిరూపింపబడ గలిగిన యెడల సంఘము కూలిపోయి ఛిన్నాభిన్నమగును.

క్రీస్తే ఆ బండయని, స్థిరమైన పునాది యని చెప్పబడెను. 1 కొరింథి 10:4 లో మోషేతో కూడ సముద్రము గుండా నడిచిన వారిని గూర్చి పౌలు చెబుతు "వారందరు ఆత్మ సంబంధమైన ఒకే ఆహారమును భుజించిరి; అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మ సంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే" యని పలికెను. మరల 1 కొరింథి 3:9-11లో అతడిట్లు వ్రాసెను : "మేము దేవుని జత పనివారమై యున్నాము; మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునై యున్నారు. దేవుడు నాకనుగ్రహించిన కృప చొప్పున నేను నేర్పరియైన శిల్పకారునివలె పునాది వేసితిని. మరి యొకడు దాని మీద కట్టుచున్నాడు;

ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో జాగ్రత్తగ చూచుకొనవలెను. వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసుక్రీస్తే." ఇవిగాక వేరే వచనములు ఒకవేళలేకపోయినను, వీటిని బట్టి క్రీస్తే ఆ బండయని, పునాది యని గుర్తించబడుటను మనము గమనించగలము. కాని ఆయన దేనికి బండ మరియు పునాదియై యున్నాడు? సంఘమునకే గదా.

సంఘము దేవుని గృహమని చెప్పబడినది. తిమోతికి వ్రాయుచు పౌలు ఇట్లు హెచ్చరించెను : "అయినను నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో, అనగా జీవము గల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని యీ సంగతులను నీకు వ్రాయుచున్నాను" (1 తిమోతి 3:15). కొరింథులోని సంఘమును గూర్చి చెబుతు దానిని దేవుని గృహముగా అతడు వర్ణించెను (1 కొరింథి 3:9).

భౌతిక భవనపు పునాదిలో అతి ప్రాముఖ్యమైనది మూలరాయి. దేవుని గృహమగు సంఘమునకు కూడ అట్లే. ఈ సందర్భములో క్రీస్తే ఆ మూలరాయి. ఆయనను గూర్చి యెషయా ప్రవక్త ఇట్లనెను: "ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు - సీయోనులో పునాదిగా రాతిని వేసిన వాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి. అమూల్యమైన తలరాయి. బహు స్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది, విశ్వసించువాడు కలవరపడడు" (యెషయా 28:16). "ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి,మూలకు తలరాయి ఆయెను" అని దావీదు పలికెను (కీర్తన 118:22). ఇదే సంగతి లూకా 20:17, మార్కు 12:10, మత్తయి 21:42 లో మరల చెప్పబడెను. పేతురు యూదుల అధికారులకు క్రీస్తును గూర్చి ప్రకటించుచు అపొ. కా. 4:11 లో ఇదే వచనమును ఎత్తి చూపించెను. ఎఫెసులో యున్న సంఘమునకు వ్రాయుచు పౌలు దీనిని ఇట్లు

బలపరచెను : "కాబట్టి మీరిక మీదట పరజనులును, పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును, దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును,ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:19-22). చివరిగా పేతురిట్లు వ్రాయుచున్నాడు: "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు. ఏలయనగా ఇదిగో నేను ముఖ్యమును, ఏర్పరచబడినదియు, అమూల్యమునగు మూలరాతిని సీయోనులో స్థాపించుచున్నాను : ఆయనయందు విశ్వాసముంచువాడు ఏ మాత్రమును సిగ్గుపడడు అను మాట లేఖనమందు వ్రాయబడి యున్నది. విశ్వసించుచున్న మీకు, ఆయన అమూల్యమైన వాడు; విశ్వసింపని వారికైతే, ఇల్లు కట్టువారు ఏ రాతిని నిషేధించిరో అదేమూలకు తలరాయి ఆయెను. మరియు అది అడ్డురాయియు అడ్డుబండయు ఆయెను. కట్టువారు వాక్యమున కవిధేయులై తొట్రిల్లుచున్నారు. దానికే వారు నియమింపబడిరి" (1 పేతురు 2:5-8).

పునాది ఎంత బలముగా యుంటే దానిపై నిర్మించబడిన భవనముకూడ అంతే బలముగా నుండును. ప్రభువు దీని నెరుగును. అందువలననే ఆయన సంఘమునకు పునాదిగాను, బండగాను ముఖ్య మూలరాయిగాను చేయబడెను. మత్తయి 7:24-27లో యిండ్లు కట్టుకొనిన ఇద్దరు మనుష్యులను గూర్చి ఆయన ఒక ఉపమానము చెప్పెను. ఒకడు బుద్ధిమంతుడు, మరొకడు

బుద్ధిహీనుడు. వారు వేసిన పునాదులను బట్టి వారి ఒక్కొక్కరి యిల్లు నిలుచుట గాని లేక కూలిపోవుట గాని జరిగెను. ఆత్మీయముగా చెప్పుకొనవలెనంటే ఒకడు ప్రభువు బోధకు చూపించు మనస్తత్వమును బట్టి అతని పునాది ఆధారపడి యుండును. గనుక ఒకడు దేవుని చిత్తమునకు లోబడిన యెడల (మార్కు 16:16; అపొ. కా. 2:37, 38), ప్రభు వతనిని రక్షించి తన సంఘముతో చేర్చుకొనును (అపొ. కా. 2:47). దానికి క్రీస్తే పునాదియై యున్నాడు. నీవు ఎవరిమీద నిర్మించుచున్నావు?

-- 0 --

# యోహాను యేసును లోకమునకు పరిచయము చేయుట

## (John Introduces Jesus)

### యోహాను సువార్త మొదటి అధ్యాయము

నీవు యేసును లోకమునకు ఏ విధముగా పరిచయము చేస్తున్నావు? నీ మాటలు వినువారు నిజముగా ఆయన ఎవరో అర్థము చేసుకొనుచున్నారా? యోహాను సువార్త మొదటి అధ్యాయములోనే, యోహాను యేసును గూర్చి పది విధములుగా లోకమునకు పరిచయము చేసాడు.

**1. ఆయన వాక్యమై యుండెను :**

ఆదియందు వాక్యముండెను (యోహాను 1:1)

వాక్యము ద్వారా ఒకరి మనసులోని భావమును వేరొకరికి తెలియపరచ వచ్చును. "చెట్టు" అనే మాటను మనము విన్నప్పుడు - ఆ చెట్టు ఏ విధముగా ఉండునది, మన మనస్సులో ముద్రితమగును. దేవుడు, బైబిలునందు వ్రాయబడిన మాటల ద్వారా మనుష్యులకు అనేక విషయములు

తెలియపరచుటలో యేసును ముఖ్యమైన సాధనముగా వాడుకొన్నాడు. కనుక యేసును గూర్చి ఎక్కువగా అధ్యయనము చేసినచో, మనకు దేవుని పరిశుద్ధత, శక్తి, జ్ఞానము, ప్రేమ మొదలగు అనేక విషయములు స్పష్టముగా తెలియబడును. "యేసు - ఫిలిప్పు, నేనింత కాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడు గనుక తండ్రిని మాకు కనపర్చుమని ఏల చెప్పుచున్నావు? తండ్రియందు నేనును, నాయందు తండ్రియు ఉన్నామని నమ్ముట లేదా?" అని చెప్పెను (యోహాను 14:9:10). "(యేసు) దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండెను" (హెబ్రీ 1:3). "ఏలయనగా దేవత్వము యొక్క సర్వసంపూర్ణత శరీరాకారముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలస్స 2:9). కనుక యేసును గూర్చి, వినుట ద్వారా లేక చదువుట ద్వారా మనము దేవునియందు విశ్వాసముంచగలము. "ఆయన జగత్తు పునాది వేయబడక మునుపే నియమింపబడెను గాని తన్ను మృతులలో నుండి లేపి తనకు మహిమనిచ్చిన దేవుని యెడల తన ద్వారా విశ్వాసులైన మీ నిమిత్తము కడవరి కాలమందు ఆయన ప్రత్యక్ష పరచబడెను. కాగా మీ విశ్వాసమును, నిరీక్షణయు దేవునియందు ఉంచబడి యున్నవి" ( 1 పేతురు 1 : 20, 21).

## 2. ఆయన దేవుడైయుండెను:

"ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవునియొద్ద ఉండెను.వాక్యము దేవుడై యుండెను" (యోహాను 1:1). "అందుకు తోమా- నా ప్రభువా నా దేవా అనెను." "నేనును తండ్రియు ఏకమైయున్నామని ఆయన వారితో చెప్పెను" (యోహాను 10:30). ప్రపంచము సృష్టించకమునుపే తండ్రియు కుమారుడు పరలోకమందున్నారు. "మరియు పరలోకమునుండి దిగివచ్చినవాడే". (అనగా యేసు పరలోకమునుండి వచ్చినవాడు అనగా తండ్రితో పరలోకమందు కలడు

అని అర్థమవుచున్నది. గనుక తండ్రియు పరిశుద్ధాత్ముడు, కుమారుడు కలిసి వున్నారు) (యోహాను 3:13). "తండ్రీ లోకము సృష్టించకముందు నీ యొద్ద నాకు ఏ మహిమ ఉండెనో" ......(అనగా లోకము పుట్టక మునుపే తండ్రియు యేసును కలసి ఉన్నారు.) (యోహాను 17:5). తండ్రియైన దేవుడే కుమారుడైన దేవుని (యేసు) ద్వారా సర్వమును సృజించెను. "........సమస్తమును ఆయన మూలముగా కలిగెను" (యోహాను 1:3). ".....ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:2). "ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందు న్నవియు, దృశ్యమైనవిగానీ, అదృశ్యమైనవిగానీ అవి సింహాసనములైననూ, ప్రభుత్వములైననూ, ప్రధానులైననూ, అధికారములైననూ సర్వమును ఆయనయందు సృజించబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టి సృజించబడెను" (కొలస్స 1:16). "దేవుడు మన స్వరూపమున మనపోలిక చొప్పున నరులను చేయుదము" (ఆదికాండము 1:26). సరియైన సమయమందు యేసు పరలోక మహిమను వీడి, మానవుడుగా ఈ లోకమందు ఉద్భవించి మనకొరకు జీవించి మన కొరకు చనిపోయి లేచి మరల తన మహిమ యందు ప్రవేశించెను.

"క్రీస్తు యేసుకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని ఎంచుకొనలేదు. గాని మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్ను తానేరిక్తునిగా చేసుకొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను. అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని, భూమిక్రింద వారిలో గాని ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని

మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొననట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను." (ఫిలిప్పీ 2:5-11). "తండ్రి ఎవనికిని తీర్పు తీర్చడుగాని, తండ్రిని ఘనపరచునట్లుగా అందరునూ కుమారుని ఘనపరచవలెనని తీర్పు తీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు. కుమారుని ఘనపరచని వాడు ఆయనను పంపిన తండ్రిని ఘనపరచడు" (యోహాను 5:21-22). "అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, అధికారమును,బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును. అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువుల నందరినీ తన పాదముల క్రింద ఉంచు పర్యంతము ఆయనరాజ్యపాలన చేయుచుండ వలెను. కడపట నశింపచేయబడు శత్రువు మరణము. దేవుడు సమస్తమును క్రీస్తు పాదముల క్రింద లోపరచి యుంచెను. సమస్తమును లోపరచబడి యున్నదని చెప్పినపుడు ఆయనకు సమస్తమును లోపరచినవాడు తప్ప సమస్తమును లోపరచబడియున్నదను సంగతి విశదమే." (1 కొరింథి 15:24-27).

### 3. ఆయన వెలుగై యుండెను :

"దేవుని యొద్దనుండి పంపబడిన యొక మనుష్యుడుండెను. అతని పేరు యోహాను. అతని మూలముగా అందరు విశ్వసించునట్లు అతడు ఆ వెలుగునుగూర్చి సాక్ష్యమిచ్చుటకు సాక్షిగా వచ్చెను" (యోహాను 1:6, 7). వెలుగు జ్ఞానమును ఇచ్చును. మరియు సంతోషమునిచ్చును. మన గమ్యము క్షేమకరముగా చేరుటకు వెలుగు దోహదకారి అగును. దేవుడు సువార్త వలన మనలను వెలుగులోనికి తీసికొనివచ్చెను ( II తిమోతి 1:10). సువార్త అనగా యేసుక్రీస్తు యొక్క మరణ సమాధి, పునరుత్థానములను వాస్తవములే. అనగా

క్రీస్తును గూర్చి వినుటయే మనలను వెలుగులోనికి నడిపించును. అనగా క్రీస్తే వెలుగులోనికి నడిపించును. ఆయన వెలుగై యుండి మనలను వెలుగులోనికి నడిపించుచున్నాడు. కనుక యేసే వెలుగైయున్నాడు.

## 4. ఆయన దేవుని కుమారుడై యుండెను :

యేసు, దేవుని ఏకైక కుమారుడైయున్నాడు (యోహాను 1:14, 34, 18, 3 :16). మనుష్యులందరు దేవుని సంతానమై యున్నారు. (అపొ. కా 17:29). "దేవుడు ఆత్మలకు తండ్రియైయున్నాడు" (హెబ్రీ 12:9). ప్రతి మనుష్యుని యొక్క ఆత్మయు, లేక ప్రతి స్త్రీ యొక్క ఆత్మయు దేవుని చేత వారి వారి శరీరములలో అనుగ్రహింపబడుచున్నది. అనగా మనుష్యులయొక్క ఆత్మలను మనుష్యుల యొక్క శరీరములో దేవుడే అనుగ్రహించుచున్నాడు. ".......మనుష్యుని అంతరంగములో జీవాత్మను సృజించెను" (జెకర్యా 12:1). యేసు యొక్క ఆత్మ యేసు పుట్టకమునుపే యున్నది. ఆయన ఆత్మ శరీరముతో ఆరంభము కాలేదు. అనగా ఆయన శరీరాకారముగా రాకమునుపే ఉన్నవాడై యున్నాడు. ఇదే మనుష్యులకును, క్రీస్తునకును ఉన్న తేడా. దేవుడు అద్భుతరీతిగా మరియ గర్భమున యేసును జన్మింపజేసెను (మత్తయి 1:20). శరీరరీతిగా ఆయనకు తండ్రి లేడు. ఆయన తండ్రి దేవుడే, గనుక యెహోవా దేవునికి యేసు ఏకైక కుమారుడు. యోసేపు తండ్రిగా ఎంచబడెను. గాని అతడు ఆయన తండ్రి కాడు. యేసు శరీరాకారముతో రాకమునుపే లోకములో ఉండెను. "తమ యందు ఉన్న క్రీస్తు ఆత్మ క్రీస్తు విషయమైన శ్రమలను గూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమను గూర్చియు ముందుగా సాక్ష్యమిచ్చునపుడు" (1 పేతురు 1:10, 11). కనుకక్రీస్తు యొక్క ఆత్మ ప్రవక్తలలో ఉండి ముందుగానే ఆయనను గూర్చి అనగా పుట్టుకను, మరణమును గూర్చియు, తరువాత ఆయనకు కలుగు మహిమను గూర్చి ప్రవచించెను. "బేత్లెహేము ఎఫ్రాతా

యూదావారి కుటుంబములో నీవు స్వల్పమైన గ్రామమైననూ నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును" (మీకా 5:2). కనుక యేసుకు శారీరక తల్లియున్నది గాని తండ్రి లేడు. క్రీస్తు దేవుని ఏకైక కుమారుడు. కావున ఆయన దేవుని కుమారుడు (యోహాను 8:42).

## 5. ఆయన యేసై యుండెను :

యేసు ద్వారా కృపయు సత్యమును కలిగెను (1:17). ప్రతి మానవునికి ఒక పేరు ఉంచవలెను. ఆలాగుననే ఆయనకు యేసు అనుపేరు పెట్టబడెను. "ఇదిగో నీవు గర్భమును ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరుపెట్టుదువు" (లూకా 1:31, మత్తయి 1:21). ఇతరులకు కూడా ఈపేరు ఉన్నది. "మరియు యూస్తు అను యేసు కూడా మీకు వందనములు చెప్పుచున్నాడు" (కొలస్స 4:11). కనుక యేసు ఎవరనునది ఆనాటి ప్రజలకు తెలియవలసియున్నది. కనుకనే ఆయన నజరేయుడైన యేసు అనిపిలువబడెను. యేసు అనగా రక్షకుడని అర్థము.

## 6. ఆయన క్రీస్తై యుండెను:

"మేము మెస్సీయను కనుగొంటిమి" (1 : 42). పాత నిబంధన హెబ్రీ భాషలో వ్రాయబడినది. హెబ్రీ భాషలో మెస్సీయ అనుపదము క్రొత్తనిబంధనలోని క్రీస్తు అనుపదము ఒకటే. క్రీస్తు అనుపదమునకు అభిషిక్తుడు అని అర్థము. పాత నిబంధనలో అనేకమంది వ్యక్తులు అభిషేకించబడినట్లు చూడగలము. అభిషేకము తరువాతనే వారికి అధికారము ఇయ్యబడినట్లు, వారు బాధ్యతలు స్వీకరించినట్లు చూడగలము. మోషే అహరోనును అభిషేకించెను (లేవీ 8:12). ఏలీయా ఎలీషాను అభిషేకించెను (1 రాజులు 19:10). సమూయేలు దావీదును అభిషేకించెను (1 సమూయేలు 16:1, 13). ప్రధాన యాజకుడు అగుటకు

అభిషేకము ఉన్నది. ప్రవక్త అగుటకు అభిషేకము ఉన్నది. యేసు కూడా దేవుని చేత అభిషిక్తుడైనాడు. "మీరు సిలువ వేసిన ఈయేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" (అపొ. కా. 2:36). కనుక యేసును ప్రధాన యాజకునిగాను, ప్రవక్తగాను, రాజుగాను దేవుడు అభిషేకించెను. (యోహాను 1:32-34; లూకా 41:8, 21; అ॥కా 10:38; హెబ్రీ 3:1 అపొ. కా. 3:22-27; యోహాను 12:14, 15). కనుక యేసు, క్రీస్తు ఆయెను.

### 7. ఆయన ప్రభువై యుండెను :

".......ప్రభువు త్రోవను సరాళము చేయుడి అని అరణ్యములో వెలుగెత్తు ఒకని శబ్దము" (యోహాను 1:23). ఇశ్రాయేలీయులలో అనేకమంది ప్రభువులు కలరు. ఇది గౌరవార్థకముగా పిలిచెడి పదము. ప్రభువులు సహజముగా ప్రజలను పరిపాలించువారు. కాని యేసుప్రభువులకే ప్రభువు (ప్రకటన 17:4). దేవుడు ఆయన ద్వారా మనలను సృజించెను. గనుక మరి నిశ్చయముగా ఆయనమనలను ఏలుబడి చేయుటకు అధికారము కలిగినవాడు. మరియు మన మీద ఆయనకు సర్వాధికారము కలదు. ఎందుకనగా ఆయన మన రక్షణ కొరకు మూల్యమును చెల్లించెను. అనగా తన ప్రాణమును మన కొరకు పెట్టెను. ".....ఆయన రక్తము వలన విమోచన అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగి యున్నది" (ఎఫెస్సీ 1:7). "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘము" (అపొ. కా. 20:28). ".....మీరు మీ సొత్తు కారు. విలువ పెట్టి కొనబడినవారు....." (1 కొరింథి 6:19, 20). క్రీస్తు అనగా అభిషిక్తుడు. అనగా దేవుని నుండి అధికారము పొందినవాడు. ప్రభువు అనగా మన మీద అధికారము కలిగినవాడు.

## 8. ఆయన దేవుని గొర్రెపిల్లయై యుండెను :

"......ఇదిగో లోకపాపమును మోసికొని పోవు దేవుని గొర్రెపిల్ల" (యోహాను 1:29). పాత నిబంధనలో ఎటువంటి లోపములేని గొర్రెపిల్లలను, మేక పిల్లలను జంతువులను దేవునికి అర్పణగా ఇచ్చినట్లు చూచుచున్నాము. "....నిర్దోషమైన ఏడాది మగపిల్లను తీసికొనవలెను. గొర్రెలలో నుండియైననూ, మేకలలో నుండియైనను, దానిని తీసికొనవచ్చును" (నిర్గమ 12:45). "......గొర్రె, మేకలలోనుండి యైనను దోషము లేని మగదానిని అర్పింపవలెను. దేనికి కళంకముండునో దానిని అర్పింపకూడదు. ....సమాధాన బలిరూపముగా గోవునైనను, గొర్రెనైనను, మేకనైనను యెహోవాకు తెచ్చినపుడు అవి అంగీకరించబడునట్లు దోషము లేనిదైయుండవలెను. దానిలో కళంకమేదియు ఉండకూడదు. గ్రుడ్డిదేమి, కుంటిదేమి, కొరతగలదేమి, గడ్డగలదేమి, గజ్జిగలదేమి, చిరుగుడు గలదేమి అట్టివాటిని యెహోవాకు అర్పింపకూడదు. వాటిలో దేనిని బలిపీఠము మీద యెహోవాకు హోమము చేయరాదు" (లేవీ 22:18-22). మానవ పాపపరిహారార్థ నిమిత్తము అనేక జంతు బలులు జరిగినవి. "ఆ కోడె మాంసమును, దాని చర్మమును, దాని పేడను, పాళెమునకు వెలుపట అగ్నితో కాల్చవలెను. అది పాప పరిహారార్థమైన బలి" (నిర్గమ 29:14). అయినప్పటికిని జంత బలులకు మానవుని పాపము తీసివేయుటకు శక్తి చాలకపోయెను. "ఏలయనగా ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుటఅసాధ్యము" (హెబ్రీ 10:4). పాత నిబంధనలోని బలులన్నియు యేసుక్రీస్తువారి బలికి ముంగుర్తుగా ఉన్నవి. ఆయన రక్తమే మానవుల పాపమును తీసివేయుటకు శక్తి కలిగినది. ఈయన బలియాగమును గూర్చి ప్రవక్తలు ముందుగానే ప్రవచించిరి. ".....అతనికి స్వరూపమైనను సొగసైనను లేదు....వధకు తేబడు గొర్రెపిల్లయు.......బొచ్చు కత్తిరించు వాని యెదుట

గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరవలేదు. అతని నలుగగొట్టుటకు యెహోవాకు యిష్టమాయెను....అతడు తన్ను తానే అపరాధ పరిహారార్థ బలిచేయగా.....అనేకుల పాపములు భరించుచు తిరుగుబాటు చేసిన వారిని గూర్చి విజ్ఞాపన చేసెను" (యెషయా 53 :1-12). ఆయన పశువుగా కూడా వధింపబడినట్లు 1 కొరింథీ 5:7లో చూడగలము. "క్రీస్తు అను మన పస్కా పశువు". కనుక గొఱ్ఱెలు మేకలు, పశుబలులకు బదులుగా ఆయనే గొఱ్ఱెగా, మేకగా, పశువుగా కలువరి సిలువలో బలియాయెను.

"అయితే క్రీస్తు రాబోవుచున్న మేలులు విషయమై ప్రధాన యాజకుడుగా వచ్చి తానే నిత్యమైన విమోచన సంపాదించి హస్తకృతము కానిది అనగా ఈ సృష్టిసంబంధము కానిదియు మరి ఘనమైనదియునైన గుడారము (క్రీస్తుసంఘం) ద్వారా మేకల యొక్కయు, కోడెలయొక్కయు రక్తము కాక తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలము (పరలోకము) లో ప్రవేశించెను. ఏలయనగా మేకలయొక్కయు, ఎడ్లయొక్కయు రక్తమును మైలపడినవారిమీద ఆవు దూడ బూడిదె చల్లుటయు, శరీర శుద్ధి కలుగునట్లు వారిని పరిశుద్ధ పరచిన యెడల నిత్యుడగు ఆత్మద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషిగా అర్పించుకొనిన క్రీస్తుయొక్క రక్తము నిర్జీవక్రియలు విడచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధిచేయును" (హెబ్రీ 9:11-15; 10:1). ఆయన పరిశుద్ధమైన గొఱ్ఱెపిల్ల, నిర్దోషమైన పశువు, ఆయనలో పాపములేదు. 'మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని సమస్త విషయములలో మనవలె శోధింపబడినను ఆయన పాపము లేనివాడుగా యుండెను' (హెబ్రీ 4:15). కనుక ఆయన కొరకు ఆయన మరణించలేదు గాని మనపాప ప్రాయశ్చిత్తముకొరకు ఆయన మరణించెను. సర్వసృష్టి సృజింపబడక మునుపే ఆయన మానవుల పాపములకొరకు గొఱ్ఱెపిల్లవలె మరణించవలెనని దేవుని చిత్తమైయున్నది.

ఆయన జగత్తు పునాది వేయబడక మునుపే నియమింపబడెను (1 పేతురు 1:18-21; ఎఫెస్సీ 3 : 11 ; 1 : :6). కనుక ఆ గొర్రెపిల్ల, అనీతిమంతులైన మనకొరకు ఒక్కసారే బలియై దేవుని యొద్దకు నడిపించుటకును, ఆత్మవిషయములో బ్రతికింపబడి, పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. (1 పేతురు 3 : 18 ).

## 9 ఆయన బోధకుడై యుండెను:

" యేసు వెనుకకు తిరిగి వారు తన్ను వెంబడించుటచూచి - మీరేమి వెదుకుచున్నారని వారినడుగగా వారు రబ్బీ - నీవు ఎక్కడ కాపురమున్నావని ఆయన నడిగిరి. రబ్బీ అను మాటకు బోధకుడు అని అర్ధము" (యోహాను 1:38). ఆయన గృహములయందు సమాజ మందిరములయందు కొండలమీదను, రహదారులలోను పర్వతముల మీదను, సముద్రతీరములయందును, సముద్రముపైననూ ప్రతి స్థలమందును బోధించెను. ఆయన వివరించు పద్ధతియును, అధికారముగల ఆయన బోధకును ప్రజలు విభ్రాంతి నొందిరి. "యేసు ఈ మాటలు చెప్పి ముగించినపుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలెగాక అధికారము గలవానివలె బోధించెను" (మత్తయి 7:28, 29). "... ఆ మనుష్యుడు మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాట్లాడలేదనిరి." (యోహాను 7 : 45, 46). ఆయన చేసిన అద్భుతములద్వారా ఆయన బోధ దేవునియొద్దనుండి వచ్చినదని గ్రహించిరి (యోహాను 3:2).

## 10 ఆయన ఇశ్రాయేలీయుల రాజైయుండెను :

" నతానియేలు, బోధకుడా! నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజువని ఆయనకు ఉత్తరమిచ్చెను" (1:49). ఇశ్రాయేలు అనగా అర్థమేమి? శరీరరీతిగా అబ్రాహాము సంతానమైన ఇశ్రాయేలును గూర్చి అతడు

మాట్లాడుచుండెనా? అదికాదు. "...ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులు కారు... శరీరసంబంధులైన పిల్లలు దేవుని పిల్లలు కారుగాని వాగ్దాన సంబంధమైన పిల్లలు సంతానమని ఎంచబడుదురు" (రోమా 9:6-8). మరి ఇప్పుడు అబ్రాహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు (గలతీ 3:29). క్రీస్తు సంబంధులే అబ్రాహాముయొక్క వాగ్దాన బిడ్డలు. క్రీస్తు సంబంధులు కావలెనంటే పాపులు, క్రీస్తును గూర్చి సువార్త వినవలెను, విశ్వసించవలెను. పాపముల విషయమై మారు మనస్సు పొందవలెను, క్రీస్తును తమనోటితో ఒప్పుకొనవలెను, పాపములు కడిగివేయబడు నిమిత్తము బాప్తిస్మమును పొందవలెను. అప్పుడు వారు రక్షింపబడిన వారై క్రీస్తు సంఘములో క్రీస్తు ద్వారా చేర్చబడి క్రీస్తు సంబంధులు అగుదురు. వారు అబ్రాహాము యొక్క వాగ్దానబిడ్డలు అగుదురు. వారే క్రైస్తవులు, వీరికి ఆయన రాజైయున్నాడు (ప్రకటన 17:14). క్రీస్తు సంఘమే ఆయన రాజ్యమైయున్నది. (అ। కా। 20:2; ప్రకటన 5:9; మత్తయి 16 : 18, 19 1 పేతురు 2:9; రోమా 16:16). క్రైస్తవులే దేవుని యొక్క ఇశ్రాయేలీయులు (గలతి 6:16). గనుక ఈ ఇశ్రాయేలీయులకు ఆయన రాజైయున్నాడు. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని రాజ్య నివాసులుగా జేసెను" (కొలస్స 1:13). ఆయన రాజులకు రాజు (ప్రకటన 17:14).

గనుక యోహాను సువార్త మొదటి అధ్యాయములోనే యోహాను, యేసునుగూర్చి - వాక్యముగా, వెలుగుగా, దేవుని ఏకైక కుమారునిగా, యేసునుగా, క్రీస్తుగా, ప్రభువుగా, దేవుని గొర్రెపిల్లగా, బోధకునిగా, ఇశ్రాయేలు రాజుగా, దేవుడుగా మనకు పరిచయము చేసెను.

కనుక ఆయన మాత్రమే ఆత్మీయమైన ఆశీర్వాదములను, ఈ లోకములో సమృద్ధియైన జీవితమును పరలోకంలో నిత్య జీవమును ఇయ్యగలిగినవాడు (యోహాను 6:68; 10:10; ఎఫెస్సీ 1:3; 1 తిమోతి 4:8).

-రోయస్ ఫ్రెడరిక్

## తిరిగి జన్మించిన క్రైస్తవుడు

### (Born again Christian)

ప్రజలు తిరిగి జన్మించిన క్రైస్తవుని గూర్చి మాటలాడుట వినియుందుము. ఈ విధమైన అభిప్రాయము వెలిబుచ్చుటలో అర్ధమేమి? వేరొక రకమైన క్రైస్తవుడు ఉన్నాడా?

బైబిలు ప్రకారము ప్రతీ క్రైస్తవుడు తిరిగి జన్మించిన వ్యక్తి. అతడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను తిరిగి జన్మించినవాడు. నిజానికి ఒకడు ఇంకో విధంగా క్రైస్తవుడుకాలేడు. "తిరిగి జన్మించిన క్రైస్తవుడు" అను పదము ఒక్కసారికూడా బైబిలులో ప్రస్తావించబడలేదు. ఆ మాట ప్రత్యేక రకమైన క్రైస్తవుని గూర్చిన ఆలోచనను కలుగజేయుచున్నది. క్రైస్తవుడనగా క్రైస్తవుడు మాత్రమే. అనగా క్రీస్తును అనుసరించినవాడు (అపో.కా. 11:26). ఎవరైతే యేసుయొక్క ప్రాయశ్చిత్తార్థమైన మరణమువలన రక్షించబడినవారో, ఎవరినైతే ప్రభువు తన సంఘమునందు చేర్చెనో మరియు ఎవరికైతే దేవుని నిత్య రాజ్యములో ప్రవేశింతునను నిరీక్షణ కలదో అతడు క్రైస్తవుడు (రోమా 3:21-26; 5:6-11; అపో. కా 2:27 11 కొరింధి 5:1).

దేవుని యొక్క నిత్యరాజ్యమైన పరలోకములోనికి ప్రవేశించవలె నన్నట్టయిన అతడు తప్పని సరిగా తిరిగి జన్మించవలెను. అతడు క్రొత్తగా జన్మించవలెను. అదియుకూడ అతడు ఆత్మమూలముగాను, నీటి

మూలముగాను క్రొత్తగా జన్మించవలెను అని నిస్సందేహముగా స్పష్టమగుచున్నది. క్రీస్తు ఈలాగు బోధించెను. "ఒకడు తిరిగి జన్మించితేనేగాని దేవుని రాజ్యమును చూడడు." ఇంకను స్పష్టముగా అర్థమగుటకు ఆయన ఈలాగు చెప్పెను. "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశించడు (యోహాను 3:3,5).

## తిరిగి జన్మించాలి

ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను ఎట్లు జన్మించగలడు? అది దేవుని ఆజ్ఞయని మనము గమనించాలి. మరియు ప్రతీ వ్యక్తి దీనికి సమ్మతించవలెను. ఇది వ్యక్తిగతముగా జరిగించవలసిన కార్యము. అది నిగూఢమైన మర్మముకాదు. అటువంటి ఉద్దేశము బైబిలులో ఎక్కడను వ్యక్త పరచబడలేదు.

నిశ్చయముగా ఒకడు క్రైస్తవుడు కాగోరినట్లయిన అతఢు తిరిగి జన్మించాలి. అతడు తిరిగి జన్మించుట వలన క్రైస్తవుడు అగును గాని మరి ఏ మార్గముననుకాడు. తిరిగి జన్మించుటకుగాను ప్రభువు ఏవిధమైన నిగూఢమైన మర్మమును వాగ్దానము చేయలేదు. ఒకడు క్రైస్తవుడగుటకు అట్టి ఎలాంటి ఉదాహరణ బైబిలు అంతటిలో ఇయ్యబడలేదు.

బైబిలు మాత్రమే ఒకడు క్రైస్తవుడగుటకు మరియు క్రైస్తవత్వములోనికి చేరుటకు ఒక ప్రామాణికమైన అధికారము. బైబిలు చెప్పునదేమనగా ఎప్పుడైతే ఒకడు యేసుక్రీస్తు యొక్క సువార్త బోధింపబడగావిని, క్రీస్తునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము నీటిలోముంచబడుతాడో అట్టివాడు క్రైస్తవుడగును (యోహా 3:16; అపో 2:38). ఈ వాక్యభాగములను గమనించండి. "ఒకడు నీటిమూలముగాను

ఆత్మమూలముగాను జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యములో ప్రవేశించడు" మరియు " నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (యోహాను 3:5 మరియు మార్కు 16:16). రక్షించబడినవాడు మాత్రమే పరలోకములో ప్రవేశించును.

## సత్యవాక్యమునకు విధేయులు కావాలి

పరిశుద్ధాత్మవలన దేవుని వాక్యము మానవునికి ఇవ్వబడినది. మానవుడు అట్టి వాక్యమునకు విధేయత చూపినపుడు అది అతనిని రక్షణలోనికి నడిపించును. అపోస్తలుడైన పేతురు క్రైస్తవులకు ఈవిధముగా వ్రాసాడు: "మీరు క్షయబీజము నుండికాక శాశ్వతమగు జీవము గల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడినవారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమకలుగునట్లు మీరు సత్యమునకు విధేయులగుటచేత మీ మనస్సులను పవిత్ర పరచుకొనినవారైయుండి యొకనినొకడు హృదయ పూర్వకముగాను మిక్కుటముగాను ప్రేమించుడి" (1 పేతురు 1:22,23). ఆత్మచేత సత్యమునకు విధేయులగుటవలన వారు ఏలాగు తిరిగి జన్మించిరి? దేవుని వాక్యముద్వారా.

ఇక్కడ ఒక ఉదాహరణ ఉన్నది. క్రీస్తు సువార్తను మొట్టమొదటిగా జన సమూహము విన్నపుడు వారి హృదయములలో నొచ్చుకొని "సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపోస్తలులను అడుగగా పేతురు - మీరు మారు మనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు." "కాబట్టి అతని వాక్యమును అంగీకరించిన వారు

బాప్తిస్మము పొందిరి. ఆదినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి." (అపో.కా. 2:37, 38, 41). ఆఖరి వచనములో మనము అట్టి ప్రజలను గూర్చిచూడగలము.

"వీరు అపోస్తలుల బోధ యందును, సహవాసమందును, రొట్టె విరచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి."

ఈలాగున మారు మనస్సు పొందిన ప్రజలు నీటిమూలముగాను ఆత్మమూలముగాను తిరిగి జన్మించిరా? అవును తిరిగి జన్మించిరి. వారు యేసుక్రీస్తు సువార్తమ విన్నారు. మరియు ఆయన యందు విశ్వాసముంచారు. పాపముల విషయమై మారుమనస్సు పొందారు. పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందారు (నీటిలో ముంచబడ్డారు).

## క్రొత్త జీవితము

క్రొత్త జన్మతో క్రొత్త జీవితము ప్రారంభమగును. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రిమహిమ వలన క్రీస్తు మృతులలోనుండి ఏలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిబెట్టబడితిమి" అని అపోస్తలుడైన పౌలు రోమా 6:3,4 లో చెప్పెను.

విశ్వాసి యొక్క బాప్తిస్మము యేసు యొక్క మరణ సమాధి పునరుద్ధానములకు సాదృశ్యముగా యున్నది. పాపముల విషయమై చనిపోయిన ఒక విశ్వాసి మారుమనస్సు పొంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా

పాతి పెట్టబడును. నీటి నుండి బయటకి వచ్చుట ద్వారా క్రీస్తులో నూతనత్వము పొంది నడచుటకు ప్రారంభించును. ఈలాగున ఒకడు తిరిగి జన్మించాలి. నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించాలి. ఈ లాగుననే ఒకడు క్రైస్తవుడగును. వేరొక మార్గము లేదు.

గమనించండి - ఒక క్రైస్తవుడు తిరిగి జన్మించడు. కాని ఒకడు తిరిగి జన్మించుట ద్వారా క్రైస్తవుడగును.

- సన్నీ డేవిడ్, న్యూఢిల్లీ (Vot)

## క్రీస్తు సంఘ ఆరాధన

### (The Worship of the Church of Christ)

యేసు చెప్పెను: "అయితే యదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చేయున్నది. తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెననెను" (యోహా 4:23-24). మన ఆరాధన దేవునికి అంగీకారయోగ్యంగా నుండునట్లు రెండు విషయాలను ఆయన కోరుచున్నాడు 1. ఆత్మతో ఆరాధించవలెను. అంటే మన హృదయాలు, మన జీవితం సరిగా ఉండుటయేగాక సరియైన అవగాహన కావాలి. మనం చేయుచున్నదేదో మనం గ్రహించాలి (యెష 1:11-20 సామి 28:9 మత్త 15:8). 2. మనం సత్యముతో ఆరాధించాలి. సత్యముతో ఆరాధించవలెనంటే ఆయన సత్యమునునుసరించి ఆరాధించాలి. "ఆయన వాక్యమే సత్యము" (యోహా 17:17). దేవునికి

అంగీకార యోగ్యంగా మన ఆరాధన ఉండాలంటే ఆయన వాక్యానుసారంగా ఆరాధించాలి.

క్రైస్తవులు పాల్గొనవలసిన ఆరాధనాంశములేమిటో క్రొత్త నిబంధన తెలియజేయుచున్నది. పాత నిబంధనలో ఆరాధనాంశములున్నాయి. అవేమంటే నాట్యము, యాంత్రిక సంగీతము, జంతు బలులు, ప్రత్యేక గాయకులు, ధూపము మొదలగునవి. ఇవి ఇశ్రాయేలీయులకు మాత్రమే ఆజ్ఞాపింపబడినవి. క్రీస్తు సిలువనొద్ద సమానమైన యుగంలో దేవుని ప్రజలకు పాత నిబంధన అమలులో ఉన్న చట్టంగా ఉండేది (కొలస్స 2 : 13-14 ). నేడు క్రైస్తవులు ఎట్లు ఆరాధించాలని దేవుడు కోరుచున్నాడో మనం తెలిసికోవాలంటే క్రీస్తు చట్టమైన క్రొత్త నిబంధన నుండి నేర్చుకొనవలసియున్నది. ఆరాధనాంశములు గ్రహించుటకు సులభంగా క్రొత్త నిబంధనలో వ్రాయబడినవి.

## ప్రభు రాత్రి భోజనము

## (The Lord's Supper)

ప్రభు రాత్రి భోజనములో రెండు పదార్థాలున్నాయి. 1. పులియని రొట్టె 2. ద్రాక్షారసము. మన పాపముల నిమిత్తమై సిలువలో బలియైన యేసు క్రీస్తు శరీరము మరియు రక్తమును జ్ఞాపకము చేసికొనుటయే ప్రభురాత్రి భోజనము యొక్క ఉద్దేశ్యము (మత్త 26:26-29). ప్రభురాత్రి భోజనములో పాలు పొందు సమయంలో క్రీస్తు శరీరమును రక్తమును జ్ఞాపకము చేసికొనుచు (రొట్టెను శరీరమునకు జ్ఞాపకముగాను, ద్రాక్షారసమును రక్తమునకు జ్ఞాపకముగాను) వివేచించి తీసుకొనుటలో జాగ్రత్తను కలిగియుండాలి (I

కొరింధీ 11:23-30). ప్రతి ఆదివారమున ప్రభు రాత్రి భోజనమును ఆచరించాలి (అ॥కా 20:7).

## ప్రార్థన

## (Prayer)

ప్రార్థన ఆరాధనయందలి అంశము. మన దైనందిన జీవితంలో కూడ ప్రార్థన ఒక భాగమే. ప్రార్థన విషయంలో క్రొత్త నిబంధన అనేక ఆజ్ఞలను ఇచ్చింది ( I తిమోతి 2:1, 28 ఫిలిప్పీ 4:6 మొ॥). మనం చేసే ప్రార్థనలో దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. మన అవసరాలు, యితరుల అవసరాలు కూడ మన ప్రార్థన ద్వారా దేవునికి తెలియ జేయాలి. యేసు ప్రభువు ఒక "మాదిరి" ప్రార్థనను యిచ్చెను (మత్త 6:5-15). ఈ ప్రార్థన మనం పదే పదే చేయనవసరం లేదు. మన ప్రార్థన అనంతరం ఈ ప్రార్థన చేయాలని ఆయన ఈ ప్రార్థన నేర్పలేదు. యేసు క్రీస్తు మన మధ్యవర్తి, ప్రధాన యాజకుడు. అందుచేతనే ఆయన నామములో మన విన్నపములు తండ్రికి తెలియజేయవలసి యున్నది (యోహా 16:23, I తిమో 2:5 హెబ్రీ 4:14-16; I యోహా 2:1-2).

## వాక్యోపదేశము

## (Preaching God's Word)

వాక్యమును ప్రకటింపవలెనని ప్రభువు ఆజ్ఞాపించెను (మత్త 28:19-20). రక్షింపబడిన వారికి, రక్షింప బడనివారికి కూడ వాక్యము ప్రకటించ వలసి యున్నది. వాక్యోపదేశము ఆరాధనలో ఒక భాగం (అ॥కా 2:42). క్రీస్తులో మనము ఎదుగునట్లును, అబద్ద బోధలపై విజయం సాధించునట్లును, ఇతరులకు

బోధించగలుగునట్లును వాక్యము చదివి గ్రహించవలసిన వారమైయున్నాము (I పేతు 2:1-2; II తిమో 2:2; 4:15).

## ఇచ్చుట

## (Giving)

కానుకలు సమర్పించుట ఆరాధన యందలి భాగము. సంఘము దాని పని నిర్వహించగలుగునట్లు అవసరమైన నిధిని సమకూర్చుటకు యిది దోహద పడుతుంది. యిచ్చుటను గూర్చిన నిర్దిష్టమైన నియమాన్ని దేవుడు మన కనుగ్రహించెను (I కొరింధి 16:2).

1. ఎవరు ఇవ్వాలి? "ప్రతివాడును" అని వ్రాయబడింది.
2. ఎప్పుడు ఇవ్వాలి? "ఆదివారమున" అని వ్రాయబడింది.
3. ఎంత ఇవ్వాలి ? "వర్ధిల్లిన కొలది" అని వ్రాయబడింది.

సంతోషంగాను, హృదయపూర్వకంగాను ఇచ్చుటలో దేవుని యెడల మనప్రేమ వ్యక్తమౌతుంది ( II కొరింధి 9:7).

## పాడుట

## (Singing)

పాటల ద్వారా క్రైస్తవులు దేవుని స్తుతించాలని ఆజ్ఞాపింపబడిరి (కొలస్స 3:16). దేవుడు తన సంఘములో గాత్ర సంగీతమునే కోరుచున్నాడు. గాత్ర సంగీతమంటే పాటలు పాడుట. క్రైస్తవ ఆరాధనలో యాంత్రిక సంగీతమును ఉపయోగించినట్లు క్రొత్త నిబంధనలో ఎక్కడా చూడలేము. అట్టి మాదిరిగాని

ఆజ్ఞగాని ఎక్కడా కనపడుట లేదు.

మన పాటలతో యాంత్రిక సంగీతమును చేర్చుట పాపము. ఎందుకంటే ఆయన మాటలకు ఏదైన కలుపుట పాపము. ఏ మానవునికి అట్టి అధికారము లేదు (ప్రక 22:18-19 II యోహా 9-11). "హృదయములలో ప్రభువును గూర్చిపాడుచు కీర్తించుడి" అని వ్రాయబడింది. హృదయము దేవుని చేత నిర్మించబడింది. వాద్యములైతే మానవ నిర్మితమైనవి కదా!

పాటలు పాడుటకు ప్రత్యేక గుంపులు ఉండాలని, ప్రత్యేక గాయకులుండాలని దేవుడు ఆజ్ఞాపించలేదు. ప్రతి క్రైస్తవుడు పాడాలి, ప్రతి క్రైస్తవుడు ప్రభురాత్రి భోజనములో పాలు పొందాలి. ఆరాధన మనలను వినోద పర్చుకొనుట కొరకు కాదు. మన ఆరాధన దేవుని సంతోషపెట్టేదిగా ఉండాలి. మన భావోద్రేకముల కొరకు ఆరాధన ఉద్దేశింపబడలేదు.

నిజ క్రైస్తవులు దేవుని ఆరాధిస్తారు. నిజక్రైస్తవుడు దేవుని ఆరాధించకుండ ఉండలేడు. దేవుని ఘనత, ఆయన మహిమ, ప్రభావము, జ్ఞానము బలమును బట్టి ఆయన ఆరాధనామూర్తి . మరియు ఆయన గొప్పదయచేత తన అద్వితీయ కుమారుని మన పాపముల కొరకు సమర్పించుట వలన ఆయన ప్రేమ ప్రత్యక్ష పరచబడింది. "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతి యాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). అప్పుడే మన హృదయంలో ఆనంద తరంగములు పొర్లి పారును.

- రాడ్ రూథర్ ఫర్డ్ (TVC)

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమము ద్వారా మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకములు మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/** –లు ఈక్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ.100/ –లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరములవరకు "సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయము తెరవండి. మావద్దలభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1 | కీర్తన పుస్తకం | రూ.14–00 |
| 2 | పెద్ద అచ్చు బైబిలు | 110–00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75–00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25–00 |

గమనిక : మీరు పంపు పైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**
Sambamurthi Street, Ramaraopet,
KAKINADA - 533 004.

కలిగించెను. మిక్కిలి ఆత్మీయమైన వాతావరణము, ఆదరణ, సహవాసము, ప్రేమ, ఆసక్తి, బాధ్యత సదస్సులో గోచరమాయెను.

ఫిబ్రవరి 11,12,13 తేదీలలో మద్రాసులోని నేషనల్ బైబిలు కాలేజి నిర్వహించుచున్న బైబిల్ లెక్చరర్‌షిప్‌లో సోదరులు జాషువా గూటం గారు ప్రారంభ ప్రసంగీకునిగా పాల్గొని యాకోబు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయములోని మొదటి 18 వచనములపై గంభీరోపన్యాసము చేసిరి. సభకు హాజరైన అనేక మంది అమెరికా సోదర సోదరీలు, భారతీయులు గొప్ప మేలు పొందిరి.

---

Regd. No. H/KD-45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To